సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 15 : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన పోతుగంటి మహేశ్వరికి రూ.16వేలు, పులిగిల్ల ఉమారాణికి రూ.15 వేలు, ఎండీ.షాబుద్దీన్‌కు రూ.30వేలు, పేర్ల పోచవ్వకు రూ.25వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని, పేద మధ్య తరగతి కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, నాయకులు కనకయ్య, పులిగిల్ల సాంబయ్య, నాగరాజు, శ్రీనివాస్, రాకేశ్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

చేర్యాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పాఠశాలకు విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చేర్యాల, అక్టోబర్ 15 : పట్టణంలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో 2008-09 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం నాటి జ్ఞాపకాలు, పరీక్షల తీరు, ఉపాధ్యాయులు బోధన తదితర వాటిని నెమరు వేసుకున్నారు.కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

మండలంలోని జిల్లా పరిషత్ నాగపురి ఉన్నత పాఠశాలలో 1988-89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.25వేల విలువైన మైక్ సెట్‌ను మంగళవారం స్కూల్‌కు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎలికట్టె ఐలయ్య మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి, వసతులు కల్పించేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు.కార్యక్రమంలో పూర విద్యార్థులు చిర్ర యాదగిరి, బి.లక్ష్మణ్, పి.శ్రీనివాస్, గొట్టం తిరుపతిరెడ్డి, ఎస్.డి. మూబీన్, డి.చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్. వెంకయ్య, మోకు కనకయ్య,జంబుల సాయిరెడ్డి, ఈ.నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన హేమచంద్ర

చేర్యాల, అక్టోబర్ 15 : పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న పి.హేమచంద్ర రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపర్చినట్లు హెచ్‌ఎం మట్ట దేవేందర్‌రెడ్డి తెలిపారు.ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట మండలంలోని కోస్గిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హేమచంద్రను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన హేమచంద్ర జాతీయస్థాయికి ఎంపిక కానున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ట్రేడర్లు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలి

హుస్నాబాద్‌టౌన్,అక్టోబర్ 15: రైతాంగం పండించిన ధాన్యాన్ని మార్కెట్‌లోనే ట్రేడర్లు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని బీఎస్పీ నాయకులు మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ట్రేడర్లు మార్కెట్‌కు రాకుండా తమ ఇండ్లవద్దనే ధాన్యాన్ని మద్దతు ధరకంటే తక్కువకే కొనుగోలు చేస్తున్నారని వారు ఆరోపించారు. మిల్లుల్లో ఉన్న వేబ్రిడ్జి కేంద్రాల్లో తూకాల్లో తేడాలు వస్తున్నాయని, తక్షణమే తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతాంగం ఇబ్బందులను పట్టించుకోవాలని, లేనిపక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి డేగల వెంకటేశ్, ఎలగందుల శంకర్, హన్మంత్, సుధాకర్, మహేందర్ పాల్గొన్నారు.

కరాటేతో సెల్ఫ్ డిఫెన్స్

విద్యార్థులకు బ్లాక్ బెల్ట్స్ సర్టిఫికెట్స్ అందజేస్తున్న అడిషనల్ డీసీపీ

సిద్దిపేట కలెక్టరేట్,అక్టోబర్15: జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా సిద్దిపేట షోటోకన్ స్టైల్‌కి చెందిన 14 మంది విద్యార్థులు కరాటేలో బ్లాక్ బెల్ట్స్ సాధించగా అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి బ్లాక్ బెల్ట్స్, సర్టిఫికెట్స్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మట్లాడుతూ సెల్ఫ్ డిఫెన్స్‌కు కరాటే చాలా ముఖ్యమన్నారు. చిన్నప్పుడే పిల్లలకు కరాటే నేర్పించాలన్నారు. మహిళలు కరాటే నేర్చుకోవడం చాలా ముఖ్యమన్నారు. రాష్ట్ర కరాటే చీఫ్ ఎగ్జామినర్ రాపోల్ సుదర్శన్, సిద్దిపేట జిల్లా చీఫ్ ఆంజనేయులు పాల్గొన్నారు

మార్కెట్‌కు హద్దులు ఏర్పాటు చేయాలి

కొమురవెల్లి, అక్టోబర్ 15 : మండలంలోని ఐనాపూర్‌లో వ్యవసాయ మార్కెట్‌కు హద్దులు ఏర్పాటు చేయాలని మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐనాపూర్‌లో సర్వే నెంబర్ 60, 61లో ఐదు ఎకరాల 33 గుంటల భూమి ఉందని, ఈ భూమిలో ఆరేండ్లుగా వ్యవసాయ మార్కెట్ నిర్వహిస్తున్నామన్నారు. వెంటనే మార్కెట్ భూమికి హద్దులు ఏర్పాటు చేసి ధరణిలో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తేలు ఇస్తారి, సున్నం యాదగిరి, సుక్క ఎల్లయ్య, పాశం చంద్రయ్య, ఎండీ.గోరేమియా, తేలు కనకయ్య, అల్లె స్వామి, శంకర్ పాల్గొన్నారు.

'లద్నూర్' నిర్మాణ పనులను పూర్తిచేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్15: మద్దూరు మండలంలోని లద్నూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను పూర్తి చేసి, రిజర్వాయర్ ద్వారా మండల రైతాంగానికి సాగునీరందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం లద్నూర్‌లో సీపీఎం గ్రామ మహాసభను రాగుల రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14ఏండ్ల కింద మొదలైన రిజర్వాయర్ పనులు నేటికీ పూర్తి కాలేదని, ఇప్పటికీ 30శాతం పనులు మిగిలే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, నాయకులు ఎల్ల స్వామి, భాస్కర్, కనకయ్య, సిద్దిమల్లు, శ్రీను, రవి, రాజయ్య, మల్లయ్య, హనుమంతు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఐనాపూర్ గ్రామస్తులు

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు గ్రామ సమస్యలు విన్నవిస్తున్న ఐనాపూర్ గ్రామస్తులు

కొమురవెల్లి, అక్టోబర్ 15 : తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను మంగళవారం మండలంలోని ఐనాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు కలిశారు. గ్రామంలో పెండింగ్ సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేశారు. మల్లం బాలయ్య, ఈగ కనకయ్య పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 15 : ప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కుకునూరుపల్లి మండల విద్యాధికారి బి.సత్తయ్య అన్నారు. మంగళవారం కుకునూరుపల్లి మండలంలోని లకుడారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూవిద్యార్థులు 10 జీపీఏ సాధించే విధంగా టీచర్లు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్15: ధూళిమిట్ట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ పై ఇటీవల అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని మంగళవారం మద్దూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 16 ఏండ్ల మైనర్‌ను అదే గ్రామానికి చెందిన రాజు కిడ్నాప్ చేశాడు. ఈ క్రమంలో ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న క్రమంలో నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు

కాంటా కాక తంటాలు

- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం రాశులు
- రైస్ మిల్లుల్లో రూ.1800లకు విక్రయిస్తూ నష్టపోతున్న రైతులు

చేర్యాల మండలం ఆకునూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రాశులు

చేర్యాల, అక్టోబర్ 15 : కాంగ్రెస్ సర్కారు రైతుల పట్ల వివక్ష చూపుతున్నది. వర్షాకాలం సీజన్ ధాన్యం పంట చేతికి రావడంతో10 రోజులుగా చేర్యాల ప్రాంతంలో రైతులు వరి కోతలు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసే ప్రదేశానికి ధాన్యం తీసుకు వచ్చి రైతులు పోస్తున్నారు. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు ధాన్యం రాశుల కోసం కాపాలాఉంటున్నారు.కొమురవెల్లి, మద్దూరు, మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా ఐకేపీ ఆధ్వర్యంలో సంబంధితశాఖ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇటీవల ప్రారంభించారు. చేర్యాల, ధూళిమిట్ట మండలాల్లో కేంద్రాలు ఇప్పటి వరకు ప్రారంభించలేదు,కొమురవెల్లి, మద్దూరు మండలాల్లో ప్రారంభించిన కేంద్రాల్లో ఇప్పటి వరకు ఎలాంటి కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదు.కొన్ని గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభించడంతో ఇక ధాన్యం కొనుగోలు ప్రారంభమవుతుందని భావించిన రైతులు వారు పండించిన వడ్లను పొలాల నుంచి నేరుగా కేంద్రాలు ప్రారంభించిన ప్రదేశాలకు తీసుకువచ్చి రాశులుగా పోసి కొనుగోలు కోసం పడిగాపులు కాస్తున్నారు.ఇప్పట్లో కేంద్రాలు ప్రారంభమయ్యే పరిస్థితి లేదని తెలిసిన మరికొందరు రైతులు రైస్‌మిల్లుల్లో ధాన్యం విక్రయిస్తున్నారు.ప్రభుత్వ మద్దతు ధర రూ.2303 (ఏ గ్రేడ్), 2280 కామన్ రకానికి ఉండగా, రైతులు మిల్లుల్లో క్వింటాల్ రూ.1800 నుంచి రూ.1850 చొప్పున విక్రయించి నష్టపోతున్నారు. మిల్లుల్లో విక్రయాలు జరిపే రైతులకు ధాన్యం విక్రయించిన వెంటనే డబ్బులు కావాలంటే 2శాతం కటింగ్‌తో కొందరు మిల్లర్లు డబ్బులు చెల్లిస్తున్నారు.15 రోజుల వరకు వేచి ఉంటే రైతు అమ్మిన పంటకు సంబంధించిన డబ్బులను మొత్తం చెల్లిస్తున్నారు. రోజురోజుకు మారుతున్న వాతావరణ పరిస్థితులు, వర్షాలు కురుస్తుండడంతో వరిపంటను విక్రయించుకోలేక రైతులు సతమతమవుతున్నారు.సంబంధితశాఖ అధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం

రాజిరెడ్డిపల్లిలో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న డాక్టర్ రమేశ్‌బాబు

జగదేవపూర్‌లో గాలికుంటువ్యాధి నివారణకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్వేత

గజ్వేల్, అక్టోబర్ 15: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని రాజిరెడ్డిపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. పశుఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ఈనెల 15నుంచి నవంబర్ 14వరకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలమణిశ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది మీనా, హాజీ పాల్గొన్నారు.

జగదేవపూర్‌లో ..

జగదేవపూర్, అక్టోబర్15: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధికి తప్పకుండా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి శ్వేత అన్నారు. జగదేవపూర్‌లో గాలుకుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులకు అధిక నష్టం కలిగించే గాలి కుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వీఏ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

మణికంఠకు అభినందనలు

గజ్వేల్, అక్టోబర్ 15: ఈ నెల 6 నుంచి 13వరకు జాతీయ స్థాయి ఎన్‌సీసీ ట్రెక్కింగ్ క్యాంపులో ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో టెన్త్ చదువుతున్న దూలం మణికంఠ పాల్గొన్నారు. ఈ క్యాంపు ఆంధ్రప్రదేశ్ 35వ బెటాలియన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో కొనసాగింది. జాతీయస్థాయిలో వివిధ రాష్ర్టాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ఆరుగురు పాల్గొనగా అందులో తెలంగాణ నుంచి సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థికి అవకాశం లభించింది. ఈ క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులకు మూడు సార్లు తిరుమల కొండపైకి కాలినడకన నడిపించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొన్న మణికంఠను పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ప్రిన్సిపాల్ రాయప్ప అభినందించారు.

గజ్వేల్‌లో వైద్యుల నిరాహార దీక్ష

నిరాహార దీక్ష చేస్తున్న వైద్యులు

గజ్వేల్, అక్టోబర్ 15: పశ్చిమబెంగాల్‌లోని వైద్య విద్యార్థిపై దాడి జరిగినప్పటి నుంచి నేటికీ అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, ఐఎంఏ చేపట్టిన 12గంటల నిరాహార దీక్షకు మద్దతుగా మంగళవారం గజ్వేల్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై జరిగిన దాడికి నిరసనగా పది రోజులుగా అక్కడి వైద్య విద్యార్థులు చేపడుతున్న ఆందోళనకు మమత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఐఎంఏ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు నరేశ్ బాబు, రాష్ట్ర ఏఎంఎస్ ట్రెజరర్ పెంటాచారి, డాక్టర్ లింగం, వైద్యులు నాగమున్నెయ్య, సాయినాథ్‌రెడ్డి, పద్మజ్యోతి, శైలజ, సురేశ్‌రెడ్డి, సుజాత, శివకుమార్, శ్రీలత, రాజాకుమార్, శ్రీనివాస్, మహిపాల్, సురేశ్, అఫ్రోజ్, గీత, నాగేంద్ర పాల్గొన్నారు.

మత్స్యకారులను విస్మరించిన ప్రభుత్వం

మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘం నాయకులు

సిద్దిపేట,అక్టోబర్15: మత్స్యకారుల కుటుంబాలను రేవంత్‌రెడ్డి సర్కారు రోడ్డుపాలు చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగింటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో వైస్ మాజీ ఎంపీపీ పాపయ్య, రెడ్డి యాదగిరి ప్రశాంత్‌ముదిరాజ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత మత్స్యకారులను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు వర్షాలు పడగానే ముదిరాజులకు పెద్దపీట వేస్తూ, ప్రతి సంవత్సరం చేప పిల్లలను అందించారన్నారు. సమావేశంలో రాజు, లింగం పాల్గొన్నారు.

పక్కాగా చెత్త సేకరించాలి

చెత్త సేకరణ వాహనాల డ్రైవర్లతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట,అక్టోబర్ 15: సిద్దిపేట పట్టణంలో ప్రతి ఇంటి నుంచి పక్కాగా చెత్త సేకరణ జరగాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ చెత్త సేకరణ వాహనాల డ్రైవర్లను ఆదేశించారు. మంగళవానం ఉదయం చెత్త సేకరణ వాహనాల డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. చెత్త సేకరణలో కీలకపాత్ర వహించేది వాహనాల డ్రైవర్లు, సిబ్బంది మాత్రమేనన్నారు.ఉదయం తప్పకుండా హాజరు తీసుకున్న తర్వాతనే విధుల్లోకి వెళ్లాలన్నారు. చెత్త సేకరణ అయిన తర్వాత మధ్యాహ్నం పట్టణ శివారు ప్రాంతాల్లోని చెత్తను తొలిగించాలని ఆదేశించారు. చెత్తను వేరుచేయు విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఈ ప్రేరణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధవి, కరుణాకర్ పాల్గొన్నారు.

అందరూ కలిసి మెలిసి ఉండాలి

మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 15 : భిన్నత్వంలో ఏకత్వం సిద్దిపేట ..అందరూ కలిసి మెలిసి ఉండాలని ఏసీపీ మధు అన్నారు.ఇటీవల రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న ఘటనల దృష్ట్యా వివిధ మత పెద్దలతో సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్ని మతాలు, కులాలను గౌరవించాలన్నారు.ఏదైనా ఘటన జరిగితే మత పెద్దలు ముందుకు వచ్చి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా చొరవ చూపాలని సూచించారు. సీఐ వాసుదేవ రావు,ఎస్సైలు పాల్గొనారు.

ఐకేపీ సెంటర్ ఏర్పాటుపై రైతుల అభ్యంతరం

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్15: ఉమ్మడి మద్దూరు మండలంలోని అర్జున్‌పట్లలో కొన్నేండ్లుగా ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రంపై గ్రామ రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలోనే గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు రైతులు గత నెల 19వ తేదీన కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. స్థానికంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు సెంటర్‌ను రద్దు చేసి పీఏసీఎస్ ఆధ్వర్యంలోప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై మంగళవారం ఏపీడీ మధుసూదన్ గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. ఏపీఎం బాబురావు, సీసీ మహేందర్ పాల్గొన్నారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు సన్మానం

చేర్యాల, అక్టోబర్ 15 : మండలంలోని ఆకునూరు ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.సాత్విక (8వ తరగతి), పి.అవంతిక (ఏడో తరగతి) విద్యార్థులు ఆర్టిస్టిక్ యోగా పేర్ సబ్ జూనియర్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఐలయ్య తెలిపారు.సెప్టెంబర్‌లో సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపించిన ఇద్దరు విద్యార్థులు నవంబర్ 8 నుంచి12వ తేదీ వరకు అస్సాంలోని గౌహతిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సాత్విక,అవంతికకు యువజన నాయకులు సందెబోయిన వెంకటేశ్ రూ.8వేల విలువైన యోగా దుస్తులు అందజేసినట్లు తెలిపారు. ఇద్దరు విద్యార్థులను పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సైదా, పీఈటీ ఎం.కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత

మిరుదొడ్డి, అక్టోబర్ 15 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకొన్న ఘటన మిరుదొడ్డి మండలం అందెలో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై బి.పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారన్నారు.ఇదే గ్రామంలో సిద్దిపేట నుంచి అందె గ్రామ శివారు మీదుగా ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. లారీ ఓనర్, డ్రైవర్‌పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 15 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కొండపాక మండలం దుద్దెడలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దయ్యాల మల్లేశం(40) సోమవారం తన ద్విచక్ర వాహనంపై దుద్దెడ మీసేవ వద్ద రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు వంటిమామిడి ఆర్వీంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్ద ఎత్తున తరలిరావాలి

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 15: ఎస్సీ వర్గీకరణను అమలు పర్చడంలో విఫలమవుతున్న రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడిపెంచేందుకు రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లాకార్యదర్శి బత్తుల రవీందర్ పిలుపునిచ్చారు. ఎస్సీవర్గీకరణ అమలుచేయకుండా ఉద్యోగాలను భర్తీచేస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 16వతేదీన నిజామాబాద్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ రాష్ట్రసదస్సుకు హుస్నాబాద్ నుంచి మాదిగ, ఉపకులాలు తరలిరావాలని ఆయన కోరారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

యాదయ్య మృతదేహం

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్15: ఈ నెల 13న అదృశ్యమైన వ్యక్తి మృతదేహం ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ గ్రామ బ్రిడ్జి సమీపంలో లభ్యమైంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదయ్య(52) గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఇంటి ముందు నుంచి వెళ్తున్న బైరాన్‌పల్లికి చెందిన నందనబోయిన బాలకృష్ణకు యాదయ్య మధ్య గొడవ జరిగింది. బాలకృష్ణ మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి యాదయ్య ఇంటికొచ్చి మద్యం తాగేందుకు కూటిగల్‌కు వెళ్దాం అని యాదయ్యతో అనగా ఇరువురు కలిసి వారి వారి బైక్‌లపై కూటిగల్ వైన్స్ వద్దకు వెళ్లారు. అనంతరం యాదయ్య బైక్‌ను వైన్స్ వద్ద పెట్టి ఇద్దరు ఒకే బైక్‌పై వెళ్లారు. బయటకు వెళ్లిన యాదయ్య రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. యాదయ్య ఆచూకీ కోసం కుటుంబసభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకి లభ్యం కాకపోవడంతో సోమవారం అతడి భార్య లక్ష్మి మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం కూటిగల్ గ్రామానికి చెందిన సాగర్ బైక్‌పై గ్రామం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో కూటిగల్ బ్రిడ్జి సమీపంలో బైక్‌ను ఆపి బహిర్భూమికి వెళ్లడంతో ఆ పరిసరాల్లో దుర్వాసన వస్తుండడంతో దగ్గరికి వెళ్లి చూడగా ఓ వ్యక్తి మృతదేహం కనిపించడంతో గ్రామస్తులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. గ్రామస్తులు మృతదేహాన్ని సందర్శించి యాదయ్యగా గుర్తించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. యాదయ్య మృతదేహంపై పలు చోట్ల గాయాలున్నాయి. మృతదేహం సమీపంలో మద్యం బాటిళ్లు ఉన్నాయి. యాదయ్యను బాలకృష్ణ ఇంటి నుంచి తీసుకెళ్లి హతమార్చినట్లు కుటుంబసభ్యులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని చేర్యాల సీఐ శ్రీను, ఎస్సై షేక్ మహబూబ్ సందర్శించి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని క్లూస్‌టీం సభ్యులు సందర్శించి ఆధారాలు సేకరించారు.

మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 15 : మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ మామిడాల శ్రీనివాస్ అన్నారు.సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ఫూర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 'ఒత్తిడిని ఎదుర్కోవడం' అనే అంశంపై అధ్యాపక బృందానికి కౌన్సిలర్ మామిడాల శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, అధ్యాపకులు గోపాల సుదర్శనం, ఉమామహేశ్వరి,లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హరిబాబు, సెక్రటరీ మహేందర్,జోన్ చైర్మన్ సత్యానందం పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్‌కు నివాళి

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్15: అర్జున్‌పట్ల ఉన్నత పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలామ్ చిత్రపటానికి హెచ్‌ఎం శ్రీనివాస్, లీడ్ ఇండియా రాష్ట్ర టీచర్ అంబాసిడర్ ఎంఆర్‌మూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పదోతరగతి విద్యార్థిని సంధ్యారాణి కలాం వేషధారణతో 'పిల్లలతో కలాం' నాటికను ప్రదర్శించారు.ఉపాధ్యాయులు యశోద, సుదర్శన్‌రెడ్డి, గంగాప్రసాద్, కులకర్ణి, సరిత, రజిత, అశోక్, సత్యనారాయణ, శాదుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

తొగుట, అక్టోబర్ 15: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన తొగుట మండలం గుడికందులలో మంగళవారం చోటు చేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుర్వారెడ్డి (48) మొక్కజొన్న పంటకు స్ప్రింక్లర్లు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు పైపు తగలడంలో విద్యుత్ షాక్ గుర్రై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రమణవ్వ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు లోకేశ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మిరుదొడ్డి ఎస్సై పరశురాములు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హన్‌మాన్ యూత్ అసోసియేషన్ ఎన్నిక

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్15: మద్దూరు మండలంలోని మర్మాములలో హన్‌మాన్ యూత్ అసోసియేషన్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా శ్రీధర్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులను గ్రామ మాజీ సర్పంచ్ సుందరగిరి స్రవంతిపరశురాములుగౌడ్ అభినందించారు.

విజయవంతంగా శస్త్రచికిత్స

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 15 : దీర్ఘకాలంగా కాలు నొప్పి,వాపుతో బాధపడుతున్న 67 ఏండ్ల వృద్ధుడికి రక్తనాళాల శస్త్ర చికిత్సను యశోద దవాఖాన వైద్యులు విజయవంతంగా పూర్తి చేసి ఉపశమనం కలిగించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం యశోద కాంప్లెక్స్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కాటం బాలనర్సు అనే వృద్ధుడు ఎడమ కాలు నొప్పితో బాధపడుతూ దవాఖానలో చేరాడన్నారు.అతడికి అన్ని పరీక్షలు చేయగా కాలు నొప్పితో పాటు పుండు, వాపు,పుట్ అల్సర్ వంటి గాయాలతో బాధపడుతున్నాడని తేలిందన్నారు. ముందుగా వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వ్యాధి తీవ్రత దృష్ట్యా అతడికి రక్త ప్రవాహాన్ని మెరుగుపర్చడానికి యాంజియోప్లాస్టీతో సహా వాస్కులర్ సర్జరీని సమర్థవంతంగా నిర్వహించి విజయం సాధించామన్నారు. సమావేశంలో యశోద దవాఖాన ప్రతినిధులు రాజిరెడ్డి,సురేశ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కొమురవెల్లి, అక్టోబర్ 15 : మండలంలోని ఐనాపూర్‌కు చెందిన శివరాత్రి నరేందర్ (కబడ్డీ స్టేట్ ప్లేయర్) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం, 50కిలోల బియ్యం అందజేశారు.